# అయ్యో, అయ్యో నా సిద్ధాంతం

మనిషి వెధవ సార్ !

అసలు మనిషంటే ఎవర్సార్- స్వార్థాల పుట్ట, కోరికల గుట్ట, తెలివిగల పడ్డ, గుంపులో గొడ్డు వగైరా వగైరా కద్సార్! అలా అనే కదా కాలేజీలో, మనకి నేర్పిందాన్ని నేర్చుకుని, అనుభవించి, మనం ఆమోదిస్తున్న దీనూ సార్! మనిషి అట్టాంటి వాడు కనకనే గద్సార్ ఈ లోకం ఇట్లా శుభ్రంగా, పరిపూర్ణంగా, బాగా ఎత్తుగా, ఇంకా లోతుగా, అట్టా అడ్డంగా అట్టాఐమూలగా కుళ్ళిపోయింది మరి! డాగ్ ఈట్స్‌డాగ్! కాదా సార్!

మరల్లాంటప్పుడు మరికొంచెం ముందుకు పోయి ‘ మనిషంటే వెధవ’ అని నేను నిర్వచిస్తే మీరట్లా ఉలిక్కి పడ్డారెందుకు సార్! నేను మీ మనస్సుని గాయపరిచుంటే నన్ను క్షమించండి. కావలిస్తే నిర్వచనం చెప్పిన ‘ మనిషి’ జాతిలోంచి మిమ్మల్ని మీరు మినహాయించుకోండి. కానీ నన్ను మాత్రం మనిషి వెధవ’ అని అనొద్దని అనకండి.

కనీసం, అదుగదుగో మూడు సీట్లకవతల సీట్లో కూర్చొనున్నాడే అమాయకపు మొహం రైతు, అతగాణ్ణి మోసం చేసి మడతలమీదున్న చిరుగుల లుంగీని అతగాడికి అమ్మి, ముప్పయి రూపాయలు గుంజుకుని, చటుక్కున బండి దిగి, తాడేపల్లి గూడెంలో స్టేషను వెనక్కి అదృశ్యమయిపోయిన లుంగీల వాణ్ణి, వెధవ అని అనొద్దని నన్ను అనకండి. మరీ కనీసంగా, ఆ తర్వాత ఈ రైతు అమాయకత్వానికి పకపకానవ్వి ఆనందించిన మాతోటి ప్రయాణీకులున్నారే, వాళ్ళు వాళ్ళు, ‘ డబుల్ వెధవలు’ అనొద్దనైనా నన్ను శాసించకండి.

నామాట నమ్మండ్సార్! మనిషి పచ్చి వెధవ సార్! ఎకనమిక్సుతో బి.ఏ వరకూ నేను చదువుకున్న చదువులోంచి ఎన్నెన్నో సిద్ధాంతాల్ని ఏరి తీసి, కాచి వడపోసి, తయారుచేసిన సిద్ధాంతం సార్ ఇది! స్వార్థానికి మారుపేరు మనిషి దట్సాల్. ఇదిగిదిగో ఏలూరొచ్చేసింది. మెయిలాగుతోంది. అబ్బబ్బ, ఏం ఎక్కుతున్నారండీ జనం!... అదుగో ఆ సూట్ వాలా చూసారా, తన భుజబలంతో ఎట్లా తోసుకొచ్చేస్తున్నాడో లోపలికి! ఆ వెనకాల ఆడా మగా ఇంకో పాతిక మంది! నా చిన్నప్పట్నించీ చూస్తున్నాను. ఈ మెడ్రాస్ మెయిల్లో అంతకంతకీ రద్దీ పెరగటమే గాని, తరగటమనేదిలేదుగదా! దానిక్కారణం మనిషే గద్సార్, మరలాంటప్పుడు మనిషి వెధవే కదా! బండీ బయల్దేరింది లెండి బెజవాడ రాగానే నా ప్రయాణం అయిపోతుంది

ఇదిగో కిటికీ పక్క సింగిల్ సీటర్లో ఇక్కడ కూర్చొనున్నాన్నేను. నా పక్కకొచ్చి నుంచున్నాడు సూట్ వాలా. అదిగో ఐమూలగా ఫోర్ సీటర్లో నావైపు కూర్చొనున్న ఆసామీని ‘జరుగు’ అన్నట్టుగా చేత్తో సంజ్ఞ చేస్తున్నాడు సూట్‌వాలా. ఆ ఆసామీని చేత్తో తడుతున్నాడు ‘జరుగు’ అన్నట్టు మళ్ళీ చెయ్యూపుతున్నాడు. ఆ ఆసామీ అతగాణ్ణి తేరిపార జూసి‘ముందుకు నడు!’ అన్నట్లు వరండా వైపు చెయ్యూపుతున్నాడు! భలే తమాషా సీను సార్!

ఆ ఫోర్ సీటర్లో ఉన్న నలుగురు పెద్దాళ్ళల్లోనూ ఒకడైన ఈ పంచెకట్టు ఆసామీ, తన పదేళ్ళ

పిల్లని కూడా తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు బహుశా అది కాబోలు ఆ సూట్ వాలాకి 'పక్కకి జరుగు' అనడిగే ఊపు నిచ్చింది!

దీన్ని అక్కడి జనం అంతా గమనిస్తున్నారే గాని, ఎవ్వరూ మాట్లాడలేదు అదుగో సూట్‌వాలాకి కోసం పెరిగిపోయినట్టుంది, అటూఇటూ చూసి, ఇంగ్లీషు 'స్ట్రీకేన్' పేపరు కుక్కిన సూట్‌కేసుతో దూకుడుగా ముందుకెడుతున్నాడు అక్కడా సీటు దొరకలేదు కాబోలు, పాపం వెనక్కొచ్చి వరండాలోనే నిలబడిపోయి, 'డర్టీరోగ్స్! సెల్ఫిష్ స్కౌండ్రల్స్! డామ్ ది ఇడియట్స్!' అని గొణుక్కుంటున్నాడు! చూసారా, హఠాత్తుగా అటంబాంబును ఆవిష్కరించినట్టు, లోకసత్యాన్ని ఆవిష్కరించేస్తున్నాడే పెద్దమనిషి! లోకమంతా స్వార్థంతో నిండిపోయిందని ఈయనకిప్పుడే తెలిసిందా! ఆ పంచెకట్టు ఆసామీ తనకి సీటిస్తాడని తనసలెట్లా ఆశించాడు!... ఆ మాటకొస్తే తనే ఆ సీట్లో కూర్చోనుండి ఆ ఆసామీయే వచ్చి సీటడిగితే తనిచ్చేవాడా! ఆహ , ఇచ్చేవాడాని!... ఇవ్వడుసార్. ఆయనే కాదు, అసలెవ్వడూ ఇవ్వడు! ఎందుకంటే, మనిషి.... సర్లెండి!

వాళ్ళూరొస్తోంది.

తెల్లలాల్చీ, పైజామా వేసుకోనున్న యువకుడూ, ఇద్దరు యువతులూ నా వెనక నించొచ్చి నా పక్కననుంచున్నారు, ఆ ఇద్దర్లో ఒకామె అయిదారు నెల్ల గర్భవతి. నుంచున్నుంచుని ఆ యువకుడు, గర్భవతిని చూపిస్తూ ఆ పంచెకట్టు ఆసామీతో సౌమ్యంగా అన్నాడు. " మీ పిల్లని ఇటువైపు కోర్చోబెట్టి మీరు కొంచెం లోపలికి సర్దుకుంటే ఈవిడ అక్కడ అంచున కూర్చుంటుంది. ఒట్టి మనిషి కాదు గదా!'

అదిగో, ఫెళ్ళున ఆ ఆసామీ ఏవంటున్నాడో చూసారా, " సీటు మీ భార్యకెంత ముఖ్యమో నా పిల్లకూ అంతే ముఖ్యం! నాపిల్లకు నేను టిక్కెట్టు తీసుకున్నాను. ఇరుక్కొనెందుక్కూర్చోవాలి .. అసలు మీరడగటమే తప్పు!"

పాపం, లాల్చీ యువకుడి మొహంలో కంగారు తొంగిచూస్తోంది. నాలుగైదు క్షణాలాగి సౌమ్యంగానే అతనంటున్నాడు. " పోన్లెండి, మీ అమ్మాయిని కష్టపెట్టి ఇంకొరికి సీటిమ్మనమని నేనను. '... ఈమె... నా తాలూకు మనిషి.... కాదు. . ఈవిడెవరో నాకు తెలీదు."

పంచెకట్టు ఆసామీ చటుక్కున తగ్గిపోయాడ్సార్! గర్భవతి అమ్మాయి సిగ్గుపడుతూ తలొంచుకొని రెండడుగులు వెనక్కేసి లగేజ్ పెట్టే నిలువుబీరువా తలుపుకి ఆనుకునుండిపోయింది.

పంచెకట్టు ఆసామీ అటూఇటూ చూస్తున్నాడు. యువకుణ్ణి కూడా చూస్తున్నాడు. చూసిచూసి రెండు నిమిషాల తర్వాత తన పిల్లవైపు తను కొంచెం జరిగాడు. యువకుడితో, " మీ రొచ్చి కూర్చోండి" అన్నాడు!

ఆ లాల్చీ యువకుడు, " నా కోసం నేను సీటు అడగలేదు. ఇస్తే ఈవిడికే ఇవ్వండి" అన్నాడు. అట్లాగే నా పక్కన నుంచునుండి పోయాడు.

అదుగో, ఆ ఆసామీ మొహమేకాకుండా, చుట్టుపక్కల వాళ్ళ మొహాలు కూడా వెలవెల బోతున్నాయేమిటి! ఏంటో, నన్నూ తికమక పెడుతున్నాడే యువకుడు!

యువకుడి వెనకాల నుంచొనున్న చిలకపచ్చచీర యువతి యువకుడి బుజంమీద చెయ్యేసి, " మన పెళ్ళి జరిగిన గవర్నరు పేట సత్రంలోనే కదండీ ఈ పెళ్ళి కూడా!" అంది." అవును" అన్నాడు యువకుడు.

బండి వట్లూరు స్టేషను దాటుతోంది పంచెకట్టు ఆసామీ చటుక్కునలేచి తన పిల్లని ఎత్తి పై

బెర్తుమీద కెక్కిందాడు. తను నుంచునుండే లాల్చీ యువకుడితో " మేస్టారూ రండి. మీరూ మీ శ్రీమతిగారూ వచ్చి కూర్చోండి." అన్నాడు!

యువకుడు నవ్వుతున్నాడేంటి! " అబ్బే! నా కోసం కాదని చెప్పాను కదండీ, మేమిద్దరం ఎట్లాగైనా ఇబ్బంది పడగలం. కానీ కాన్పుకాన్పుకి కొత్త జన్మ ఎత్తేవాళ్లు గదా గర్భవతులు ఆవిణ్ణి కూర్చోబెట్టుకోండి చాలు! అంటున్నాడేంటి సార్!"

డామిట్, కేసులో తికమక మరీ ఎక్కువవుతోంది! లేకపోటే, స్వార్థానికి మారుపేరయిన మనిషి ఎవరికోసమో సీటడుగుతాడా! ఎవరికోసమో మనిషి తన సీటు దానం చేస్తాడా! ఇంపాసిబుల్! ఎందుకుంటే, మీ ఇంటికి నేనొచ్చాననకోండి, నన్ను గేట్లో చూస్తారు మీరు. అప్పుడు మీరు తాగుతున్న కాఫీలో అప్పటికి వేరేగా మిగిలిన కాస్తకాఫీని చటుక్కున కలిపేసుకుని గుటుక్కున తాగేసి ఏమీ ఎరగనట్టు నవ్వుతూ బయటకొచ్చి నన్నాహ్వానిస్తారు మీరు నాకు కాఫీ ఎట్లాగూ ఇవ్వరు. మంచినీళ్లుకూడా ఆఫర్ చెయ్యరు. అవునా, కాదా!.. పోనీ ఇంకోటి, మంచిట్రాఫిక్ రద్దీలో ముసలాళ్లూ, పిల్లలూ, ఆడాళ్ళూ మీ బండికింద పటాఫట్ మని పడి పోయి పచ్చడయిపోయినా సరే లెక్కచెయ్యకుండా మీ బండీయే ముందరగా వెళ్ళిపోవాలని అక్సిలరేటర్‌ని ఝూమ్మని తొక్కేస్తారు మీరు. అవునా, కాదా! ఇవ్వి మీ తప్పులు కావు సార్. మీరు మనిషి అవ్వటంలో వచ్చిన, మీదికాని, ఒకేఒక, ఎవరో మరొకశక్తి చొప్పించిన తప్పు!

ఏం, అయితే ఇప్పుడు నాకళ్ళెదుటున్న వాళ్ళు అస్సలు సిస్సలు మనుషుల్లాగా ప్రవర్తించకపోవటేమే గొప్ప ఆశ్చర్యంగా ఉంది! ఏంటో మాయ మరి!

ఏం , ఆ పంచెకట్టు ఆసామీ అట్లా నిశ్చేష్టుడైపోయి యువకుడి వైపు అట్లా చూస్తూ నుంచుండిపోయాడుగదా, ఈ లాల్చీ యువకుడు తన భార్యతో, " పోనీ మీరిద్దరూ వెళ్ళి కూర్చోండి" అన్నాడు

గర్భవతి ( ఇప్పటికే సిగ్గుతో ఒదిగి ఒదిగిపోతోంది) " ఫర్వాలేదులెండి! నేను నుంచోగల్ను. మీరిద్దరెళ్ళి కూర్చోండి." అంది యువకుడితో

అప్పుడు అక్కడ రెండుసీట్లు ఖాళీగా అట్లాగే ఉన్నాయ్

ఆ ఆసామీ అట్లాగే నుంచునున్నాడు వీళ్ళు ముగ్గురూ నా పక్కన ఇట్లాగే నిలబడుతున్నారు. నా ముందు నిశ్శబ్దం రాజ్యమేల్తోంది సార్ ఉండుండి, నాకెదురుగా ఉన్న సింగిల్ సీటర్లో కూర్చునున్న స్టూడెంటు కుర్రాడు లాల్చీ యువకుడితో గదమాయింపుగా, " పోనీ మీరిట్రండి ఆడాళ్ళిద్దరూ అక్కడ కూర్చుంటారు." అంటూ తన సీట్లో సగం సీటు చూపించాడు. విధిలేనట్లు ఈ లాల్చీ యువకుడొచ్చి ఆ సగం సీట్లో కూర్చున్నాడు ఇదిగో ఇప్పుడెళ్తున్నారు సార్, ఆ ఆడాళ్ళిద్దరూ వెళ్ళి ఆ రెండు సీట్లల్లోనూ కూర్చున్నారు.

ఆ పంచెకట్టు ఆసామీ అట్లాగే నుంచుండి పోయాడు! చూసారా, పొరపాటున మనిషన్న వాడు ఎప్పుడైనా ఇంకొడికి సహాయం చేస్తే వాడు మిగిలిపోతాడ్సార్. చివరికి వాడు 'కర్సయి' పోతాడు! ఈ లోకం ఇంతేసార్! ఇది మనుషులున్న లోకం! మరి మనిషంటే ఎవర్సార్ మనిషంటే.... సరేసరే.

ఆగండాడండ్సార్! అదే, ఏంటిది! ఇట్టా జరుగుతోందేంటి!

నా పక్కనే ఉన్న ఫోర్ సీటర్‌లో కూర్చునున్న అయిదుగురిలో నావైపు అంచున కూర్చునున్న పెద్దమనిషి హఠాత్తుగా తన పక్కవాళ్ళని కొంచెం లోపలికి జరగమని, తనుకూడా జరిగి, ఆ పంచెకట్టు ఆసామీతో " మీరిట్రాండి!" అంటున్నాడేంటి! ఇంతసేపూ చూస్తూ కూర్చున్నవాడు ఇప్పుడిట్టా

అంటున్నాడేంటి! ... అదుగో పంచెకట్టు ఆసామీ, " పర్లేదు లెండి, మీరిప్పటికే అయిదుగుర య్యారుగా" అంటున్నాడు కానీ ఆ పెద్దమనిషి మళ్లీ పిలుస్తున్నాడు. ఇంకేం, ఈ పంచెకట్టు ఆసామీ వచ్చివాళ్ళ పక్కన ఆ ఫోర్ సీటర్లో ఇరుకుతున్నాడు!!

అయ్యో, ఇట్టాగ అందరూ కాంప్రమైజేషన్ అయిపోతే ఎట్టాగ సార్! మరి నా సిద్దాంతం సంగతేంటి సార్! అదే, మనిషి స్వార్థాలపుట్ట, కోరికలగుట్ట, గుంపులో గొడ్డు, ఒక్క మాటలో పచ్చి వెదవ- అనే సిద్దాంతం! దాని గతేంటి సార్! అయ్యో అయ్యో నా సిద్ధాంతం!

(జాగృతి పారిశ్రామిక ప్రత్యేకసంచిక 1986)

★★★ ★★★ ★★★

# బెకెట్

"గౌ॥ డాక్టర్ భైషజం గారికి,

నమస్కారాలు. నేను ముప్పయ్యేళ్ళ సంసారిని. సంస్కారిని. నాకిద్దరు పిల్లలు. నాభర్త విద్యాధికుడు మా ఇంట్లో అందరివీ మంచి ఆరోగ్యాలే. ఎటొచ్చీ నాకే ఒక సమస్య వచ్చిపడింది. ఇటీవల నాకు కలలొస్తున్నాయి. అవి ఒక రకంగా నాకు చికాకు కలిగిస్తున్నాయి. హోమియో వైద్యంలో మీరు మంచి పేరుగలవారని తెలిసి మీకు రాస్తున్నాను. తప్పక మంచి మందు సూచించవలసిందిగా కోరుతున్నాను. నేనిక్కడ కొనుక్కొని వాడగలను.

భవదీయురాలు

అమలాపురం హేమవతి"

1-బి

" హేమవతిగారికి,

అమ్మా, మీ ఉత్తరం అందింది. మీ ఇంట్లో అందరూ ఆరోగ్యంగా ఉన్నారని మీరు చెప్పటం నాకు చాలా ఆనందం కలిగిస్తోంది. ఎందుకంటే లోకంలో ఈనాడు " నా ఆరోగ్యం మంచిది" అని గుండె మీద చెయ్యేసుకుని చెప్పగల జీవుడే కరువైపోయాడు. పోతే మీ కొస్తున్న కలలు ఎలాంటివో , రాత్రిపూట వస్తున్నాయో, పగటి నిద్రలో వస్తున్నాయో మొదటి భాగంలో వస్తాయో, రెండో భాగంలో వస్తాయో , శరీరంలో అప్పుడు కలుగుతున్న మార్పులేమిటో వగైరా అనేక విషయాలు మీరు రాయలేదు. అయినప్పటికీ సాధారణంగా ఇలాంటి కేసుల్లో వాడే మందు 'బెల్లడోనా- ఆరు ఎక్స్'ని రోజూ ఉదయం కాఫీకి ముందరా, రాత్రి భోజనం తర్వాతా నాలుగేసి బిళ్ళల చొప్పున వేసుకోండి. నాది ఉచిత వైద్యం కనుక ఫీజేమీ పంపకండి. పుచ్చుకోను. పదిరోజుల తరువాత రాయండి.

భవదీయుడు

కాకినాడ డాక్టర్ భైషజం"